ప్రజాశక్తి
బుధవారం 18 డిసెంబర్ 2024
5
కర్నూలు





నీటిపారుదల శాఖ డిసి-9 కమిటీ చైర్మన్ మహేశ్వరరెడ్డికి, వైస్ చైర్మన్ హనుమంతుకు ఎన్నిక పత్రాన్ని అందిస్తున్న మైనర్ ఇరిగేషన్ ఇఇ శ్రీనివాసులు

ఓర్వకల్లు వద్ద రోడ్డు ప్రమాదం

- నలుగురు విద్యార్థులకు తీవ్రగాయాలు
- పరామర్శించిన కలెక్టర్, డిఇఒ, ఎమ్మెల్యే గౌరు చరిత
- ఓర్వకల్లులో ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్/హాస్పిటల్

ఓర్వకల్లు మండల కేంద్రంలో రోడ్డు మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... నంద్యాల వైపు నుండి కకర్నూలుకు వస్తున్న విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోను లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన నలుగురు విద్యార్థులు తీవ్రంగా వెంటనే వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో గాయాల పాలైన విద్యార్థులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ , పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిలు పరామర్శించారు. కలెక్టర్, ఎమ్మెల్యే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెండెంట్ వెంకటేశ్వర్లతో మాట్లాడూ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదానికి గురైన విద్యార్థులను ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధి బృందం కూడా వెళ్లి పరామర్శించింది. జిల్లా కార్యదర్శి అబ్దుల్లాతోపాటు నగర ఉపాధ్యక్షులు ఆర్యన్ ఉన్నారు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం రాష్ట్ర ప్రభుత్వమే అందించాలని అబ్దుల్లా డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురి చేసిన లారీ డ్రైవర్ను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు.



ఓర్వకల్లులో నిరసన చేపడుతున్న ప్రజాసంఘాల నాయకులు



విద్యార్థిని పరామర్శిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష, డిఇఒ

లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం

ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ సమీపంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆటోను లారీ ఢీకొందని ఎస్ఐ సునీల్ కుమార్ వెల్లడించారు. లారీ డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం వల్లనే ప్రమాదానికి కారణమైంది. కన్నమడకల గ్రామానికి చెందిన ఆటో ఓర్వకల్లు గ్రామానికి చెందిన సుమంత్, రెహన్, మనోజ్, ధరణి అను విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. లారీని డ్రైవరు అతి వేగంగా, అజాగ్రత్తగా నడిపి వెనుక నుండి ఆటోను ఢీకొట్టాడు. విద్యార్థులకు తీవ్ర రక్తగాయాలు అయ్యాయి. రోడ్డు ప్రమాదానికి గురయిన విద్యార్థి సుమంత్ తండ్రి శివరాం ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ఓర్వకల్లు జాతీయ రహదారిపై వైసిపి కార్మిక సంఘం, సిఐటియు, వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రోడ్డుపై బైఠాయించి కొంతసేపు ఆందోళన చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, సిఐటియు మండల ఉపాధ్యక్షులు వి.సుధాకర్, మోడల్ స్కూల్ విద్యా కమిటీ మాజీ చైర్మన్ బషీర్ అయ్యాస్వామి, మున్నా అల్లిపీరా, యువజన సంఘం నాయకులు శేఖర్లు మాట్లాడారు. ఇక్కడే జాతీయ రహదారిపై గతంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నా నివారణ చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. గతంలో జరిగిన ఘటనలను చూసిన అధికారులు మేల్కొని వెంటనే రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గాయాల పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా

డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఏకగ్రీవం

- అన్ని కమిటీలూ కూటమి కైవసం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. కర్నూలు జిల్లాలో 10, నంద్యాల జిల్లాలో 25, ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 35 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా అన్ని స్థానాల అధ్యక్షులు, ఉపాధ్యక్ష స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. అన్ని స్థానాలన్నీ అధికార పార్టీ కైవసం చేసుకుంది. కర్నూలు జిల్లాలోని తుంగభద్ర ఎల్ఎల్సి పరిధిలోని హోళగుంద డిసి అధ్యక్షులుగా మిక్కిలినేని వెంకట శివ ప్రసాద్ రావు, కౌతాళం డిసి అధ్యక్షులుగా పి టిప్పు సుల్తాన్, కోసిగి డిసి అధ్యక్షులుగా జంపాపురం అనంతసేనా రెడ్డి, పెద్దకడబూరు డిసి అధ్యక్షులు నారవ రమాకాంతరెడ్డి, ఎమ్మిగనూరు డిసి-5 అధ్యక్షులుగా బి కాశీం, ఎమ్మిగనూరు-6 డిసి అధ్యక్షులుగా ఎన్ గోవర్ధన్ రెడ్డి, గోనేగండ్ల డిసి అధ్యక్షులుగా బవిగడ్డ హుసేన్ సాహెబ్, కోడుమూరు డిసి అధ్యక్షులుగా కున్నూరు చంద్రశేఖర్, కర్నూలు-9 డిసి అధ్యక్షులుగా కె.మహేశ్వరరెడ్డి, కర్నూలు-10 డిసి అధ్యక్షులుగా అవిజ ధర్మారెడ్డి ఎన్నికయ్యారు. నంద్యాల జిల్లాలో కెసి కెనాల్ పరిధిలోని మరువకొండ, ముచ్చుమర్రి డిసి అధ్యక్షులుగా కట్టా పరమేశ్వరరెడ్డి, వెలపనూరు డిసి-2 అధ్యక్షులుగా జి తిమ్మారెడ్డి, వెలపనూరు డిసి-3 అధ్యక్షులుగా బన్నూరు రామలింగారెడ్డి, నంద్యాల డిసి అధ్యక్షులుగా కాటం రెడ్డి తులసీశ్వర్ రెడ్డి, గోస్పాడు డిసి-5 అధ్యక్షులుగా ముల్లా మహమ్మద్ ఇలియాస్ అహ్మద్, గోస్పాడు డిసి-6 అధ్యక్షులుగా శైలం భాస్కర్ రెడ్డి, ఆళ్లగడ్డ డిసి-7 అధ్యక్షులుగా ఎర్ర ప్రసాద్ రెడ్డి, ఆళ్లగడ్డ డిసి-8 అధ్యక్షులుగా బబ్బూరి వెంకట స్వామి, పెద్దముడియం డిసి అధ్యక్షులుగా అట్ల రాంపుల్లా రెడ్డి ఎన్నికయ్యారు. ఎస్ఆర్బిసి పరిధిలోని పోలూరు డిసి అధ్యక్షులుగా నయాబ్ మహమ్మద్ ఫయాజ్, మద్దూరు డిసి అధ్యక్షులుగా కసిరెడ్డి రామపుల్లా రెడ్డి, నందవరం డిసి అధ్యక్షులుగా కె రాజశేఖర్ రెడ్డి, బనగానపల్లె డిసి అధ్యక్షులుగా ఎం రఘునాథ్ రెడ్డి, గుళ్లదుర్తి డిసి అధ్యక్షులుగా తలారి మల్కి హుస్సేన్, గుళ్ల సింగవరం డిసి అధ్యక్షులుగా కె పరమేశ్వరమ్మ, అలవకొండ డిసి అధ్యక్షులుగా పి విజయ భరత్ రెడ్డి, మయలూరు డిసి అధ్యక్షులుగా అనంత రామ సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. తెలుగు గంగ ప్రాజెక్టు పరిధిలోని డిసి-1 అధ్యక్షులుగా మద్దెల శివశంకర్ రెడ్డి, డిసి-2 అధ్యక్షులుగా కంచర్ల మనోహర్ చౌదరి, డిసి-3 అధ్యక్షులుగా చింతం క్రాంతి కుమార్, డిసి-4 అధ్యక్షులుగా చెన్నారెడ్డి గారి సంజీవ కుమార్ రెడ్డి, డిసి-5 అధ్యక్షులుగా తలారి శివకృష్ణ, డిసి-6 అధ్యక్షులుగా సిగిలి నిర్మలాదేవి, డిసి-7 అధ్యక్షులుగా పత్తి తొలిశమ్మ, డిసి-8 అధ్యక్షులుగా వైవిఎస్ బింద్రాణి ఎన్నికయ్యారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పరివర్తనతో మంచి భవిష్యత్తు వైపు

- కారాగార భద్రత పై అధికారులకు, ఖైదీలకు ఎస్పి పలు సూచనలు

- జైలు జీవితాన్ని ఖైదీలు ఒక గుణపాఠంలా తీసుకోవాలి

- పంచలింగాల జిల్లా జైలును సందర్శించిన ఎస్పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఖైదీలు జైలు జీవితాన్ని గుణపాఠంలా తీసుకుని జైలు నుండి విడుదల అయిన తర్వాత మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని కర్నూలు జిల్లా ఎస్పి జి.బిందుమాధవ్ సూచించారు. జిల్లా కారాగారం భద్రత దృష్ట్యా పంచలింగాల దగ్గర ఉన్న జిల్లా కారాగారాన్ని ఎస్పి జి.బిందు మాధవ్ మంగళవారం సందర్శించారు. సెక్యూరిటి రివ్యూ కమిటి సందర్భంగా అంతర్గత భద్రత పై జైలు అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కారాగారం పరిసరాలను, ఖైదీల గదులు, ఖైదీల కొరకు వచ్చే సందర్శకుల గదిని , ఖైదీలకు ఇచ్చే ఆహార పదార్థాల నాణ్యాతను ఎస్పి పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు జైలు జీవితాన్ని గుణపాఠంలా తీసుకుని జైలు నుండి విడుదల అయిన తర్వాత మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని తెలిపారు. ఖైదీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, భద్రత లోపాలు లేకుండా చూసుకోవాలని అంతర్గత భద్రతపై జైలు సెక్యూరిటి కమిటి వారితో మాట్లాడారు. భద్రత పరంగా ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టి తీసుకురావాలని, ఖైదీలలో పరివర్తన కోసం తీసుకోవలసిన చర్యల గురించి తెలిపారు. తదనంతరం జైలు పరిసరాలు పరిశుభ్రంగా , ఆహ్లాదకరంగా ఉన్నాయని జిల్లా ఎస్పి సంతృప్తి వ్యక్తం చేసి జైలు విజిటింగ్ బుక్‌లో సంతకం చేశారు. ఈ భద్రత రివ్యూ కమిటీ సమాశంలో జిల్లా కారాగారం పర్యవేక్షణాధికారి చంద్రశేఖర్ , జిల్లా సబ్ జైళ్ళ అధికారి డి.నరసింహా రెడ్డి , డిప్యూటి జైలర్లు అనిల్ కుమార్ రెడ్డి, నాగరాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్, డిసిఆర్ బి సిఐ గుణశేఖర్ బాబు , సిబ్బంది పాల్గొన్నారు.



జైలును సందర్శిస్తున్న ఎస్పి బిందుమాధవ్

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి

- బిల్లులను దహనం చేసి సిపిఎం నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఓల్డ్ సిటీ పూలబజార్ సెంటర్లో సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడారు. ఇప్పటికే ధరలు పెరుగుదల ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై టిడిపి కూటమి ప్రభుత్వం రూ.20 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజల మీద మోపిందన్నారు. ఏనాడో వాడిన కరెంటు రాజకీయ నాయకులు పరిశ్రమలు ఫ్యాక్టరీల్లో పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రజలందరిపై భారం వేయడానికి టిడిపి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంట్ చార్జీలపై ప్రజలపై భారం వేసినందుకు ప్రజలు ఓటు వేయలేదన్నారు. వైసిపి ప్రభుత్వం కరెంట్ ఛార్జీలభారం ప్రజల మీద ఎక్కువ వేసిందని, టిడిపి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో తగ్గిస్తామని చంద్రబాబునాయుడు చెప్పారన్నారు. నేడు అదనంగా చార్జీలు చెల్లించాలని ట్రూఅప్ విధానాన్ని తేవడం మోసపూరితమైనదన్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణలు దుర్మార్గమైన షరతులు లో ఇది ముఖ్యమైనదన్నారు. 2022 - 2023 లోవాడిన కరెంటు ఈనెల నుండి 2026 జనవరి వరకు కొన్ని నెలలు 44 శాతం వరకు అదనంగా ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు. అధికారంలో వస్తే విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం విద్యుత్ బిల్లు భారాన్ని తగ్గిస్తాం అని హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం తగ్గించడం సంగతి అలా ఉంచిన ఇప్పుడు అమాంతంగా 44 శాతం విద్యుత్ ఛార్జిలో భారాన్ని ప్రజలపై వేయడం దారుణంగా ఉందన్నారు. జిల్లాలో అనేక ఏజెన్సీల ద్వారా స్మార్ట్‌మీటర్లు ఇండ్లుకు బిగిస్తున్నారని, ప్రీపెయిడ్ మీటర్లు పెట్టడం ఉపసంహరించుకోవాలని, కరెంట్ చార్జీలు తగ్గించాల ని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు కెవి సుబ్బయ్య, నగర కమిటీ సభ్యులు సి.జయమ్మ, నాగస్వాములు విద్యుత్ బిల్లులను దహనం చేశారు. మండిబజార్ యూనియన్ నాయకులు నాగస్వాములు, రాంబాబు, గిడ్డయ్య, మూసా, గోరెబై, ఇలియాస్ చాంద్‌బాష, మన్నెం, రాజు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న నాయకులు



వేణుగోపాల్‌ను అభినందిస్తున్న సభ్యులు

ఒకేషనల్ కళాశాలల ప్రెసిడెంట్‌గా వేణుగోపాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా ఒకేషనల్ కళాశాల ప్రెసిడెంట్ గా నగరంలోని కాంకర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ కె.వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రెటరీగా ఆదోని నోబుల్ కళాశాల కరస్పాండెంట్ దేవదానం, ట్రెజరర్‌గా ఎమ్మిగనూరు సృజన కళాశాల ప్రిన్సిపల్ సునీల్ ను ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణవేణి కళాశాల కరస్పాండెంట్ పవన్ కుమార్‌ను, జాయింట్ సెక్రెటరీగా ఇస్లామియా ఒకేషనల్ కళాశాల కరస్పాండెంట్ చాంద్‌బాషను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పద్మావతి జూనియర్ ఒకేషనల్ కళాశాల ఆదోని విరుపాక్షయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టేట్ ఒకేషనల్ కళాశాల అధ్యక్షులు దేవరపల్లి శాంతికుమార్, సెక్రటరీ బాలరాజు, ట్రెజరరీ శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఒకేషనల్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని జిల్లాలోని ఒకేషనల్ కళాశాలలో యాజమాన్యాలు రాష్ట్ర సభ్యులను కోరారు. సమావేశాన్ని కర్నూలు జిల్లాలోని కృష్ణవేణి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. జిల్లా ఒకేషనల్ కళాశాల యాజమాన్యాలు రాష్ట్ర సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నుకున్న ఒకేషనల్ కళాశాల సభ్యులు ప్రెసిడెంట్ రాష్ట్ర సభ్యులను సన్మానించారు. ఒకేషనల్ కళాశాల నూతన కార్యవర్గం రాష్ట్ర సభ్యులను సన్మానించారు.



క్రిస్మస్ సందర్భంగా రూ. 3వేల విలువగల యాక్సెసరీ ఫ్రీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు వెంకటరమణ కాలనీలో స్కంద క్లౌడ 9 వేణుకా వేణు మోటార్స్‌కు సంబంధించిన ఆర్ఆర్ ఇ- బైక్ కర్నూలు బ్రాంచ్ మేనేజర్ మీనిగ రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ వారి వద్ద ఇ-బైక్‌లు కొనుగోలు చేసినవారికి క్రిస్మస్ సందర్భంగా రూ.3000 విలువగల యాక్సెసరీ ఫ్రీగా ఇస్తున్నారు. వారి వద్ద థండర్ వేను రెండు బైక్ మోడల్స్ లబ్యం కాగా డ్రైవింగ్ లైసెన్స్ , రిజిస్ట్రేషన్ అవసరం లేకుండా ఇ వాహనాలను నడపవచ్చు. వాటి ప్రత్యేకతలు కీలెస్ ఎంట్రీ, రివర్స్‌డ్రైవ్ , యాంటీ- థెఫ్ట్ , సెంట్రల్ లాక్, చార్జింగ్ పోర్ట్, చార్జర్, స్పీడ్ మోడ్ అండ్ ఐసిఏటి ధృవీకరణ ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని రవికాంత్ రెడ్డి తెలిపారు.

భూ కబ్జాలపై సర్వే వివరాలెందుకు తెలపరు

-రెవిన్యూ వారిపై తోసేసిన ఇరిగేషన్ ఇంజనీర్లు

-నా భూమిని ఆక్రమించారని నిరుపేద దళిత మహిళ ఆవేదన

-నా పొలానికి వెళ్లే రస్తానాక్రమించారని సైనిక ఉద్యోగి కుమారుడు

-మీడియాను అడ్డుకొని వెనక్కి పంపిన బత్తుల బిల్డర్ యజమాని

-హైడ్రాలాంటి చట్టం తేవాలని పిపిఎస్ఎస్, ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

భూకబ్జాలపై కలెక్టర్ ఆదేశాలమేరకు సర్వే చేశాక కూడా వివరాలెందుకు అర్జీదారులకు తెలపడం లేదని పట్టణ పౌరసేవాలసంఘం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వివరాలు అడగడానికి వచ్చిన మీడియా ప్రతినిధులను బత్తుల బిల్డర్స్ అడ్డుకుని వెనక్కు పంపించారని అన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎస్సి, ఎస్టి మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ఇ.రవి శంకర్‌గౌడ్, డి.వీరభద్రుడు మాట్లాడుతూ నగరవనం, గార్గేయపురం చెరువు, చెరువుకు చెందిన అలుగు, పర్యాటక కేంద్రాల భూములు, రోడ్లు కబ్జాలకు గురయ్యాయని, గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం జరిగిందని, కూటమి ప్రభుత్వమైనా శ్రద్ధ పెట్టాలన్నారు. హైడ్రాలాంటి చట్టం తెచ్చి భూ కబ్జాలపై కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కర్నూలు సమీపంలోని బత్తుల బిల్డర్ ఆక్రమించిన గార్గేయపురం చెరువు, దాని అలుగు, నగరవనం, పర్యాటక కేంద్రాల భూముల ఆక్రమణలపై కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేసిన అధికారులు సర్వే వివరాలు అర్జీదారులకు తెలుపకుండా వెళ్లిపోయారన్నారు. రెవిన్యూ వారితో కలిసి చెరువు వాగులకు సంబంధించిన కబ్జాలపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ అధికారులు దాటవేశారు. నీటిపారుదల శాఖ ఇంజనీర్లు నాగరాజు, రియాజ్, సర్వే, భూమి రికార్డుల శాఖా అధికారులు మణికన్నన్, సుధాకర్ భూ కబ్జాలు జరిగిన ప్రాంతాన్ని సర్వే చేశారు. కర్నూలు తాలూకా పోలీసులు కూడా పాల్గొన్నారు. 40 ఏళ్లుగా మా ఆధీనంలో ఉన్న భూమిని ఆక్రమించుకున్నారని, నిరుపేద దళిత మహిళ సుశీలమ్మ మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసింది. రెండో ప్రపంచ యుద్ధంలో మరణించిన నరసయ్య కుమారుడు మిలిటరీ కాలనీకి చెందిన పేదరైతు శంకరయ్య మాట్లాడుతూ తన భూమికి నీళ్లు పారే కాల్వతో పాటు రాస్తాను కూడా లేకుండా చేశారని బిల్డర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు మహమ్మద్‌యూనుస్, షేక్ అన్వర్‌బాష, సి.మధు, మిలిటరీ కాలనీ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



భూకబ్జాపైఅధికారులు సర్వేచేస్తున్నప్రదేశాన్నిసందర్శించిన పుల్లారెడ్డి, ఇతర నాయకులు

రోడ్డు ప్రమాదంలో మరణించిన విఆర్‌ఒకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తుగ్గలి : తుగ్గలి మండలం రామకొండ విఆర్ఓ కెటి. శ్రీనివాసులు ప్రమాదవశాత్తు రోడ్డుప్రమాదంలో సోమవారం మరణించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆయన భార్యకు మట్టి ఖర్చుల నిమిత్తం ఎండిఒ ఆఫీస్ నుండి పంచాయతీ కార్యదర్శి రూ. 25 వేలు, జిల్లా రెవెన్యూ కుటుంబం సభ్యుల ఆర్థిక సహాయం చేసిన వారి తరపున తుగ్గలి మండల డిప్యూటీ తహశీల్దార్ రూ.50,000 అందజేశారు.

పేదల ఇళ్లను కూల్చే ఆలోచన విరమించుకోవాలి

ఎమ్మెల్యే గౌరుచరితకు సిపిఎం వినతి -సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : హంద్రినది, వక్కెర వాగు వెంబడి పేదల ఇళ్లను కూల్చాలనే ఆలోచన విరమించుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితకు సిపిఎం న్యూటౌన్ కార్యదర్శి టి.రాముడు వినతిపత్రం అందజేశారు. కర్నూలు నగరంలోని 33వ వార్డు కల్లూరు ఊరు వాకిలి దగ్గర కల్లూరు ఎమ్మార్వో ఆంజ నేయులు అధ్యక్షతన గ్రామ సభ నిర్వ హించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి సిపిఎం పార్టీ న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు స్థానిక ప్రజలతో కలిసి సమస్యను వివరించారు. హంద్రీ నదికి, ఒక్కెర వాగుకు బఫర్‌జోన్ పేరుతో రెవెన్యూ అధికారులు సర్వేచేసి 60 యేళ్లుగా కాపురం ఉంటున్న ఇళ్లకు మార్కులు వేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, పేదల ఇళ్లను కూల్చాలన్న ఆలోచన విరమించుకోవాలని వినతి పత్రాన్ని అందజేశారు. టి.రాముడు మాట్లాడుతూ కల్లూరు, చెంచునగర్, టైలర్స్‌కాలనీ, గంగావతినగర్, ముజఫర్‌నగర్, పందిపాడు వరకు ఎస్‌టిలు, ఎస్‌సిలు బలహీన వర్గాలకు చెందిన పేద ప్రజలు రోజు వారి కూలీలుగా పైసాపైసా కూడ పెట్టుకుని నిర్మించుకున్న వందలాది ఇండ్లను బఫర్‌జోన్ పేరుతో కూల్చేస్తామనడం సరైంది కాదన్నారు. సర్వే చేసి ఇళ్లకు మార్కులు వేయడం చాలా దారుణమని అన్నారు. ప్రభుత్వం అధికారులు పేదల ఇల్లు కూల్చాలన్న ఆలోచనను విరమించు కోవాలని, లేదంటే ప్రజలను సమీకరించి ప్రతి ఘటిస్తామని హెచ్చ రించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి స్పందిస్తూ కేవలం సర్వే మాత్రమే చేశారని, పేదల ఇల్లు కూల్చకుండా చూస్తామని ప్రజలందరూ ధైర్యంగా ఉండాలని హామీ ఇచ్చారు. ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే గౌరుచరితకు వినతిపత్రం ఇస్తున్న టి.రాముడు



ఎస్ఎస్‌సి మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ, యుటిఎఫ్ నాయకులు

ఎస్ఎస్‌సి మోడల్ పేపర్స్ ఆవిష్కరణ


ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతి ఏడాది యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే రూపొందించిన ఎస్ఎస్‌సి మోడల్ పేపర్స్ పుస్తకాన్ని మంగళవారం డిఇఒ ఎస్ సామ్యూల్ పాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శిలు దుర్గాప్రసాద్, తిమ్మన్న, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, జిల్లా నాయకులు సర్వేశ్వర్ రెడ్డి, కెంగార మోహన్, హనుమంతు, హనుమన్న, కాంతారావు, షబ్బీర్ ,సోమన్న, రాములు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్, నవీన్ పాటి మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులకు ఈ మోడల్ పేపర్స్ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ మోడల్ పేపర్స్ చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని పేర్కొన్నారు.

పదోన్నతుల సీనియారిటీ జాబితా విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాను తయారు చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ శామ్యూల్ పాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలను బుధవారం సాయంత్రంలోగా డిఇఒ కార్యాలయానికి సమర్పించాలని కోరారు.



బిందు సేద్యం పథకంపై అవగాహన

ప్రజాశక్తి- సి బెళగల్

సూక్ష్మ బిందు సేద్యం పథకం పై ఎఒ మల్లేష్ కుమార్ మంగళవారం వ్యవసాయ వనరుల కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులను సమీకరించి ఈ పంట నమోదు తప్పకుండా చేసుకోవాలని, రబీ సాగుపై అధికారులతో సంప్రదించి సాగు చేయాలన్నారు. అంతే కాకుండా సూక్ష్మ బిందు సేద్యం పథకంలో భాగంగా ప్రభుత్వం పైపులు సబ్సిడీతో అందజేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ఉపాధి' పనుల్లో రూ.2.75 లక్షలు దుర్వినియోగం

• రికవరీకి ఆదేశించిన అధికారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల


విచారణ చేపడుతున్న పీడీ

మండలంలోని వివిధ గ్రామాల్లో 2023-24 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం గత కొద్ది రోజులుగా విచారణ చేపట్టింది. ఈ విచారణలో గుర్తించిన విషయాలపై గోనెగండ్లలోని ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో మంగళవారం సంబంధిత అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, సిబ్బందితో కలిసి ఓపెన్ ఫోరం ప్రజా వేదిక నిర్వహించారు. పీడీ వెంకట రమణయ్య, అడిషనల్ పీడీ మాధవిలత, జిల్లా విజిలెన్స్ అధికారి లోకేశ్వర్, ఏపీడీ అల్లీపీరా, ఎస్ఆర్‌పి నాగార్జున పాల్గొని మాట్లాడారు. మండలంలో మొత్తం 827 పనులకు గాను 10.23 కూలీలకు రూ.6.89 కోట్ల సామగ్రికి కలుపుకొని మొత్తం రూ.17.13 కోట్ల ఉపాధి హామీ పథకం కింద ఖర్చు చేసినట్లు తెలిపారు. గత కొద్ది రోజులుగా ఈ పనులపై విచారణ చేపట్టిన సామాజిక తనిఖీ బృందం రూ.2,75,583 దుర్వినియోగమైనట్లు గుర్తించారని చెప్పారు. ఉపాధి పనులపై నిర్లక్ష్యం వ్యవహరించిన సిబ్బందిపై రూ.53,500 జరిమానా విధించామని తెలిపారు. దుర్వినియోగమైన నిధులను ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోపు రికవరీ చేయడంతో పాటు పెనాల్టీ సొమ్మును కూడా చెల్లించాలని సూచించారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపిడిఒ మణిమంజరి, ఎపిఒ మహ్మద్ బాషా, ఇసి ఉస్మాన్, సిబ్బంది బషీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎంఇఒగా రామాంజనేయులు

ప్రజాశక్తి - కౌతాళం


ఎంఇఒను కలిసిన యుటిఎఫ్ నాయకులు

ఎంఇఒ-1 ఇన్‌ఛార్జ్‌గా రామాంజనేయులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు సకాలంలో పూర్తయ్యేలా చూస్తామన్నారు. అందరి సహకారంతో పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

'పది' పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిద్దాం

పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేద్దామని ఎంఇఒ రామాంజనేయులు పేర్కొన్నారు. ఆయనను యుటిఎఫ్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు నల్లారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు రంగన్న, సుధాకర్, సీనియర్ నాయకులు బాలాజీ రావు, మంగరాజు, నాయకులు శేషు, సజీవరావు పాల్గొన్నారు.

రైతుకు సన్మానం.. అందరికీ గౌరవం

• ఆర్‌బిఒ చీఫ్ మేనేజర్ అమర్ నాథ్ శ్రీనివాస్

ప్రజాశక్తి - గోనెగండ్ల

దేశానికి వెన్నెముక లాంటి రైతులను సన్మానిస్తే మనల్ని మనం సన్మానించుకున్నట్లేనని ఎస్‌బిఐ క్రెడిట్స్ అండ్ ఎన్‌పిఎఎం ఆర్‌బిఒ కర్నూలు చీఫ్ మేనేజర్ అమర్‌నాథ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం గోనెగండ్లలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణలో 'అన్నదాత మహోత్సవం-రైతు సమ్మేళనం'ను బ్రాంచి మేనేజర్ నరేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అమర్‌నాథ్ శ్రీనివాస్ హాజరయి మాట్లాడారు. అవసరమైన రైతులకు సహాయ, సహకారాలు అందజేసేందుకు స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో 'అన్నదాత మహోత్సవం-రైతు సమ్మేళనం కార్యక్రమాలు ఈనెల 16 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా కొత్తగా ఎస్‌బిఐ ప్రవేశపెట్టిన స్కీములను వివరించారు. కిసాన్ సమృద్ధి రిన్, అగ్రి ఎంటర్‌ప్రైజెస్ లోన్, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, అగ్రి ఇన్‌ఫ్రా స్ట్రక్చర్, హై వాల్యూ లోన్ గురించి రైతులకు వివరించారు. ఆసక్తి కలిగిన రైతులు బ్యాంకును సంప్రదిస్తే రుణాలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం పదిమంది రైతులను శాలువాలతో సన్మానించారు. ఆర్ఎంఆర్ యు జాకబ్, అకౌంటెంట్ కౌసల్య, ఫీల్డ్ ఆఫీసర్ మధు, మనోహర్, రైతులు ఎస్.రహమతుల్లా, కె.మల్లయ్య, రవికుమార్, బడేసా నాయుడు, ఎస్తేరమ్మ పాల్గొన్నారు.


రైతులను సన్మానిస్తున్న బ్యాంకు అధికారులు

సమస్యలు గాలికి..!

• వ్యక్తిగత దూషణలకే పరిమితం
• కౌన్సిల్ సజావుగా సాగేనా..?
• నేడు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రాధాన్యత సన్నగిల్లుతోంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ఉండాల్సిన కౌన్సిల్ వ్యక్తిగత దూషణలతోనే ముగిసే పరిస్థితి నెలకొంది. కౌన్సిల్ సమావేశం ఛైర్మన్ అధ్యక్షతన నెలకొకసారి జరగనుంది. గత నెల 30న జరిగిన కౌన్సిల్ సమావేశం కుర్చీల కోసమే తొట్లాట అన్న రీతిలో రసాభాసగా సాగింది. బుధవారం జరిగే కౌన్సిల్ సమావేశం సజావుగా సాగేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.


మాట్లాడుతున్న ఛైర్మన్


కౌన్సిల్‌లో బైఠాయించిన కౌన్సిలర్లు (ఫైల్)

మున్సిపల్ కౌన్సిల్ హాలులో వైస్ ఛైర్మన్లకు ప్రత్యేకంగా కుర్చీలు వేసే ఆనవాయితీ ఉండని, ఉన్నట్టుండి వరుసలో ఏర్పాటు చేయడం ఏమిటంటూ వైసిపి కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. కౌన్సిలర్ల వరుసలోనే వైస్ ఛైర్మన్లు కూడా కూర్చోవాలని ఛైర్మన్ చెప్పడంతో గత కౌన్సిల్‌లో కౌన్సిలర్లు బైఠాయించారు. పట్టణంలో 42 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఒక టిడిపి ఒక కౌన్సిలర్ ఉండగా మిగతా వారంతా వైసిపి కౌన్సిలర్లే. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో వైసిపి నుంచి నలుగురు కౌన్సిలర్లు జంప్ అయ్యారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత భర్త నాగేంద్ర కూడా ఇటీవలే కండువా మార్చారు. అప్పటి నుంచి వైసిపి కౌన్సిలర్లు వర్సెస్ మున్సిపల్ ఛైర్మన్ అన్నట్లు వ్యవహారం ముదిరింది. మూడేళ్లు పూర్తయిందని, ఛైర్మన్‌ను మార్చాలని ఇటీవల బేరసారాలు సాగాయి. రాజీనామా చేసేందుకు ఛైర్మన్ శాంత ససేమిరా అనడంతో వైసిపి కౌన్సిలర్లు భగ్గుమన్నారు. తమ మద్దతుతో పీఠమెక్కి ధిక్కారస్వరం వినిపించడమేమిటంటూ ఆమెపై తిరుగుబాటు మొదలుపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటికే రెండు కౌన్సిల్ సమావేశాలు రసాభాసగా... వ్యక్తిగత దూషణలతోనే ముగిశాయి. పట్టణ శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రయినేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ జనాభాకనుగుణంగా తాగునీరు లేదని, మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించాలని ప్రజల నుంచి డిమాండ్ ఉంది. తాగునీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతున్నా ప్రత్యామ్నాయానికి ఎలాంటి చర్యలు చేపడతారో అన్న అయోమయంలో ప్రజలు ఉన్నారు.

నిలిచిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

పట్టణ నడిబొడ్డున పాత బస్టాండ్ మైదానంలో సుమారు రూ.33 కోట్లతో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో మొదలైంది. ప్రభుత్వం మారగానే ఆ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. లబ్ధిదారులు చెల్లించిన గుడ్ విల్ అమౌంటు రూ.4 కోట్లు మున్సిపల్ ఖాతాలో ఉన్నాయి. పనులు నిలిచిపోవడంతో గుడ్ విల్ చెల్లించిన లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఆ పనులు ఎందుకు ఆగాయో చెప్పడంలో అధికారులు విఫలమవుతున్నారు. వ్యక్తిగత విభేదాలు వీడి పట్టణ అభివృద్ధిపై కౌన్సిలర్ దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

విశ్వాసం కోల్పోవద్దు

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి, ఆదోని



ప్రజా సమస్యలను చర్చించి పరిష్కారం చూపాల్సిన కౌన్సిలర్లు వ్యక్తిగత దూషణలకు పరిమితమవ్వడం సరికాదు. ఇలాగే వ్యవహరిస్తే ప్రజా విశ్వాసం కోల్పోవాల్సి వస్తుంది. డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. తాగునీటి పైపులైన్లు డ్రయినేజీ కాలువల్లో ఉన్నాయి. లీకేజీ ఏర్పడినప్పుడు అందులో మురుగునీరు కలిసి కలుషితమవుతున్నాయి. ఆ నీటిని తాగి ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. పట్టణ అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించి కృషి చేయాలి. లేకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సజావుగా సాగేలా చూస్తాం

- కృష్ణ, ఆదోని మున్సిపల్ కమిషనర్



వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆజెండాలో రూపొందించాం. ఇప్పటికే అజెండాను ఛైర్మన్‌కు, కౌన్సిలర్లకు ఇచ్చాం. రెండు కౌన్సిల్లు సజావుగా సాగకపోవడం వల్ల కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి వివరాలను కౌన్సిలర్లకు ఇచ్చాం. బుధవారం జరిగే కౌన్సిల్ సమావేశం సజావుగా సాగేందుకు సహకరించాలని ఇప్పటికే కౌన్సిలర్లకు విజ్ఞప్తి చేశాం.

ప్రగతి తక్కువగా ఉన్నందుకే నోటీసులు

- ప్రజాశక్తి వార్తకు డిఎంహెచ్ఒ వివరణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఆరోగ్య శాఖలో ఎఎన్ఎంలపై పని భారం మీద ఈనెల 11న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన 'పని భారం' కథనంపై డిఎంహెచ్ఒ డాక్టర్ ఎల్.భాస్కర్ స్పందించారు. మంగళవారం ఆయన వివరణతో కూడిన ప్రకటన జారీ చేశారు. వైద్య సేవల్లో ప్రగతి తక్కువగా ఉన్నందుకే ఆయా సిబ్బందికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఇందిరానగర్ యుపిహెచ్‌సి పరిధిలో 5 సచివాలయాలు ఉండగా అందులో 2 సచివాలయాలకు సంబంధించి ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో గర్భిణులకు ఇవ్వాల్సిన ఆరోగ్య సేవల ప్రగతి తక్కువగా ఉండడంతో షోకాజు నోటీసులు ఇచ్చామని అన్నారు. పని తీరు మెరుగు పరచుకోవాలని వైద్యాధికారి, ఇద్దరు ఆరోగ్య కార్యకర్తలకు మెమో జారీ చేశామని పేర్కొన్నారు. హవన్న పేట యుపిహెచ్‌సి పరిధిలో 5 సచివాలయాలకు సంబంధించి ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో గర్భిణులు, పిల్లలకు అందించాల్సిన ఆరోగ్య సేవల ప్రగతి తక్కువగా ఉండడంతో షోకాజ్ నోటీసులు ఇచ్చామని, పని తీరు మెరుగు పరచుకోవాలని వైద్యాధికారి, ఐదుగురు ఆరోగ్య కార్యకర్తలకు మెమో జారీ చేశామని తెలిపారు.

వాణిజ్య భవనాల వేలం వాయిదా

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు మండల పరిషత్ వాణిజ్య సముదాయ భవనాల వేలం పాటలు వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ సూర్యనారాయణ మంగళవారం తెలిపారు. గతవారంలో భవనాలకు రిజర్వేషన్ ప్రకారం లాటరీ పద్ధతిలో భవనాలు కేటాయించి ఈనెల 20న వేలం వేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తూ తదుపరి వేలం ఎప్పుడనేది త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

'విద్యుత్'పై అవగాహన అవసరం

- విద్యుత్ ఇఇ విజయరాజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్ వినియోగంపై అవగాహన అవసరమని ఎమ్మిగనూరు సబ్ డివిజన్ విద్యుత్ ఇఇ విజయరాజ్ తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయం నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శ్రీనివాస టాకీస్, సోమప్ప సర్కిల్ వరకు విద్యుత్ వినియోగంపై ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ వాడకంపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, రైతులకు, ప్రభుత్వ ఉద్యోగులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యుత్ డిప్యూటీ ఇఇ బీవీ.నాగేంద్ర ప్రసాద్, మంత్రాలయం డిప్యూటీ ఇఇ విశ్వశాంతి స్వరూప్, గూడూరు డిప్యూటీ ఇఇ జేశన్, ఎమ్మిగనూరు ఎఇ ప్రసన్న ఆంజనేయులు, గ్రామీణ ఎఇ గురుమూర్తి, నందవరం ఎఇ నాగేంద్రతో పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని సమ్మతగేరి గ్రామంలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా సమ్మతగేరి, కోగిలతోట, మునానుగుంది, పెద్దహేట, చిన్నహేట, బిజి.హళ్లి, ఎల్లార్తి గ్రామాలకు తాగునీరు సరఫరా వారం రోజులుగా నిలిచి గ్రామస్తులు తాగునీటి కష్టాలు పడుతుండడంతో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ స్పందించారు. మంగళవారం సమ్మతగేరి గ్రామంలోని సిపిడబ్ల్యు స్కీమ్‌ను పరిశీలించారు. సమ్మెలో ఉన్న వాటర్ మెన్‌తో చర్చించి మరో పది రోజుల్లో జీతాలు అందేలా చూస్తానని హామీఇవ్వ డంతో వారు విధుల్లో చేరారు. అనంతరం సమ్మతగేరి, పెద్దహేట, ఎల్లార్తి గ్రామస్తులతో నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. 7 గ్రామాలకు నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఆదోని ఇఇ పద్మజ, ఆలూరు డిఇ ఇంజినీర్ మల్లికార్జునయ్య, తహశీల్దార్ సతీష్, ఎఇ రామ్‌నీలా, పంచాయితీ కార్యదర్శి రంగస్వామి, చేతన్ ప్రియా పాల్గొన్నారు.

ఆశాజనకంగా శనగ...



• అధిక దిగుబడులపై చిగురిస్తున్న రైతన్న ఆశలు

చిప్పగిరి మండలంలో పప్పు శనగ పంట ఆశాజనకంగా ఉంది. పంట ఏపుగా ఉండడంతో అధిక దిగుబడులపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత మూడు సంవత్సరాలుగా రైతులకు నామమాత్ర పంటలు చేతికొచ్చినా.. ఈఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసిన నేపథ్యంలో పంటల దిగుబడి పెరుగుతోంది.

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలంలో 45 వేల ఎకరాల సాగు భూమి ఉంది. అందులో 8 వేల ఎకరాలు మాత్రమే ఎర్ర నేల పొలం ఉంది. 37 వేల ఎకరాల నల్లరేగడి పొలం ఉంది. పప్పు శనగ పైరు వేసుకున్న రైతులే అధికంగా ఉన్నారు. అక్కడక్కడ జొన్న పైరు, పొద్దు తిరుగుడు పంట, కంది పంట వేసినట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. సాగునీరు అందే గ్రామాలైన దేగలపాడు, గుమ్మనూరు, ఏరూరు, కాజీపురం, కొట్టాల, బంటనహాల్, చిప్పగిరిలో కొద్ది వరకు మిరప పంటను సాగు చేసినట్లు రైతులు, వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. నేమకల్లు, బిల్డోన, కుందనగుర్తి, నగరడోన, రామదుర్గం, తిమ్మాపురం, సంగాల, దౌల్తాపురం, నంచర్ల గ్రామాల్లో పప్పు శనగను అధికంగా సాగు చేశారు. పప్పు శనగ పైరు విత్తనం వేసినప్పటి నుంచి నెల రోజుల వరకు అధిక వర్షాలతో నష్టపోయిన రైతులు ఉన్నారు. రైతులు కొద్ది వరకు జాగ్రత్తలు పడి అధిక తెగుళ్ల బారిన పడిన రెండు వారాలకు ఒకసారి నీళ్ల మందులు స్ప్రే చేయడంతో తెగుళ్లను కొద్ది వరకు నివారించుకున్నారు. గతేడాది కంటే ఈఏడాది పెట్టుబడులు రెండింతలు పెరిగాయని రైతులు చెబుతున్నారు. గతేడాది రెండు, మూడుసార్లు మందులు స్ప్రే చేశామని, ఈఏడాది మాత్రం నాలుగు సార్లు నీళ్ల మందులు స్ప్రే చేసినట్లు పేర్కొంటున్నారు. వర్షాలు ఎక్కువ రావడంతో పైరులో రెండుసార్లు కలుపు మొక్కలు తీయడం, రెండుసార్లు సేద్యం చేశామని రైతులు తెలిపారు. అన్నీ జాగ్రత్తలు తీసుకోవడంతో ఇప్పటివరకు పప్పు శనగ పైరు ఆశాజనకంగా ఏపుగా ఉందని, కనీసం 8 క్వింటాళ్ల దిగుబడి వస్తేనే రైతులు పెట్టుబడులు పోయి కొద్ది వరకైనా మిగులుతుందని రైతులు ఆశలతో ఉన్నారు.

మూడెకరాల్లో సాగు చేశాను

- గురు స్వామి, రైతు, నేమకల్లు



మూడెకరాల్లో శనగ పంట సాగు చేశాను. సుమారు ఇప్పటివరకు రూ.50 వేల పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతానికి శనగ పంట ఆశాజనకంగానే ఉంది. దిగుబడి పెరుగుతుందని ఆశతో ఉన్నాం. ఈ వాతావరణ మార్పులు ఏం చేస్తాయో చూడాలి.


కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

పిసిసి అధ్యక్షులు షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో షర్మిల పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచినా హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దిలీప్ ఢోకా మాట్లాడుతూ... ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో షర్మిల పని చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాయినాథ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిరావు, ఆదోని యువజన అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, ఎన్ఎస్‌యుఐ నాయకులు శ్రీనిత్ రాయల్, ఎజాజ్ అహ్మద్, నిసార్ అహ్మద్, వెంకటేష్, విశ్వనాథ్ ఉన్నారు.

'మున్సిపల్' వర్కర్స్ అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - ఆదోని

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. మంగళవారం ఆదోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అర్ధ నగ్నంగా మోకాళ్లపై నిలిచి నిరసన తెలిపారు. యూనియన్ అధ్యక్షులు పీరా సాహెబ్, ప్రధాన కార్యదర్శి అహ్మద్ హుస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమన్న మాట్లాడారు. తొమ్మిది రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని నినాదాలు చేశారు. వర్కర్స్ కరెప్ప, రామాంజనేయులు, శివరాం, అల్తాఫ్, కృష్ణమూర్తి, వీరేష్, దేవేంద్ర, రాము, శివ, శివ కుమార్, రమేష్, సిరాజ్, కైలాస్, రాంజల శంకర్, ఖాసీం, భరత్ ఉన్నారు.



శుద్ధమైన తాగునీరందించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి తాగు నీటి ఇబ్బందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 727 మంది చదువుతున్నారని, సరైన తాగునీరు లేదని తెలిపారు. మూసివేసిన మురుగుదొడ్లు, మూత్రశాలలు తెరవాలని, వీటి నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్న ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మురుగుదొడ్లు, మూత్రశాలలకు తాళాలు వేయడంతో విరామ సమయంలో సోమప్ప సర్కిల్‌లోని సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్లి వస్తున్నారని తెలిపారు. భోజనాలు చేశాక మురుగుదొడ్ల దగ్గరకు వెళ్లి నీళ్లు తాగాల్సిన దుస్థితి నెలకొందని, జిల్లాస్థాయి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు అగ్గి రాముడు, చరణ్ పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

- 28 మందికి ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి సహకారంతో ఏపి నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్ మేళాకు జస్ట్ డయల్, నవభారత్ ఎరువులు, ఎస్‌బిఐ కార్డు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో 85 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. దాదాపు 25 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. జిల్లా నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్ మాట్లాడుతూ... ఇటువంటి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయి తేజ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు కష్టాలు తీర్చడమే లక్ష్యం...

• ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ కిష్టప్ప


ప్రజాశక్తి - చిప్పగిరి

వ్యవసాయ రంగంలో రైతులకు ఏ కష్టాలూ, ఇబ్బందులూ రాకుండా చూసుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, ఎబిసి డిస్ట్రిబ్యూటరీ కమిటీ నూతన ఛైర్మన్ నగరడోన కిష్టప్ప తెలిపారు. మంగళవారం గుంతకల్లులోని ఇరిగేషన్ కార్యాలయంలో వీరభద్ర గౌడ్, ఇరిగేషన్ డిఇ చంద్రశేఖర్, జెఇలు తిమ్మారెడ్డి, అఫ్రోజ్ బేగం ఆధ్వర్యంలో ఎబిసి డిసి ఛైర్మన్‌గా నగరడోన కిష్టప్పతో ప్రమాణస్వీకారం చేయించారు. ఉప ఛైర్మన్‌గా దేగులపాడు మీసాల రామాంజనేయులుతో ప్రమాణ స్వీకారం చేశారు. ఎబిసి డబ్ల్యుయుఎ ప్రెసిడెంట్లుగా చెరుకూరు ధనుంజయ, రామదుర్గం రామచంద్ర, చింతకుంట క్రిష్టప్ప, అర్ధగేరి హరినాథ్ ప్రమాణ స్వీకారం చేశారు. వీరంతా నగరడోన కిష్టప్పను నూతన డిసి ఛైర్మన్‌గా ప్రతిపాదించడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిసి ఛైర్మన్ నగరడోన కిష్టప్ప మాట్లాడుతూ... తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌కు, సహకరించిన నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎబిసి సమస్యలపై తన శక్తి మేర కృషి చేస్తానని చెప్పారు. అనంతరం చిప్పగిరిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్, తిమ్మయ్య, మారాతి భీమప్ప, జనార్ధన స్వామి, నాగిరెడ్డి, రంగన్న, శ్రీనివాసులు, శివలింగ, పోతన్న, గోవిందరాజులు, కృష్ణమ నాయుడు, నెట్టెప్ప, సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు. **కౌతాళం** ఎంపిడిఒ కార్యాలయంలో జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి ఆధ్వర్యంలో సాగునీటి సంఘం అధ్యక్షులు డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్‌గా టిప్పు సుల్తాన్‌ను, వైస్ ఛైర్మన్‌గా గంగాభవానిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టిప్పు సుల్తాన్ మాట్లాడారు. కూటమి నాయకుల సహకారంతో సాగునీటి సమస్య రాకుండా చూస్తామన్నారు. ఆంధ్ర సరిహద్దులో 700 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా కృషి చేస్తామన్నారు. టిడిపి నాయకులు, ఎల్ఎల్‌సి అధికారుల సహకారంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరందే వరకు, రైతుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తామని తెలిపారు. ఎల్ఎల్‌సి డిఇ మహ్మద్ షఫీవుల్లా, మాజీ ఎంపిపి చందా ఖాన్, టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, సాయిబాబా, తెలుగు రైతు రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, సురేష్ నాయుడు, వీరేష్, గుండప్ప, రాజానందు, ఎంపిడిఒ సుబ్బరాజు పాల్గొన్నారు. **నందవరం :** ఎమ్మిగనూరు ఎల్ఎల్‌సి కార్యాలయంలో నిర్వహించిన చిన్నకొత్తిలి డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి చెందిన మాజీ ఎంపిపి చిన్న నరసింహారెడ్డి కుమారుడు ఎన్.గోవర్ధన్ రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా కలుగొట్ల నాగేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి చిన్నకొత్తలి డిస్ట్రిబ్యూటరీ డిసి ఛైర్మన్‌గా ప్రతిపాదించిన ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి మండల నాయకులు ముగతి ఈరన్న గౌడ్, మాధవరావు దేశాయి, రైస్‌మిల్ నారాయణరెడ్డి, నాగరాజు గౌడ్, ధర్మాపురం గోపాల్, పుష్పవతి, గురురాజ్ దేశాయి, మాచాపురం ఖాసీం వలీ, బండేగురు స్వామి, వెంకట్రామిరెడ్డి, చిన్న రాముడు, హాలహర్వి దావీదు, జగ్గాపురం ఘట్టాల రంగన్న కృతజ్ఞతలు తెలిపారు. **మంత్రాలయం**లో నూతనంగా ఎన్నికైన డిసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను మండలంలోని మాధవరం గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి స్వగృహంలో సన్మానించారు. డిసి ఛైర్మన్‌గా అనంతశయనారెడ్డి, వైస్ ఛైర్మన్‌గా అడివమ్మ, వెంకటరాముడును ఎన్నుకున్నారు. వారికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు సేవ చేసేందుకు అవకాశం కల్పించిన టిడిపికి, ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనకు కూడా శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. కోసిగి మండల నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, తోవి రామకృష్ణ, నాడిగేని అయ్యన్న, రచ్చుమర్రి నరసింహులు, శివ, వీరేష్, హుసేని, హనుమంతు పాల్గొన్నారు.


చిప్పగిరి : కిష్టప్పతో కలిసి మాట్లాడుతున్న ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్



కౌతాళంలో ఫారం అందుకుంటున్న టిప్పు సుల్తాన్, నాయకులు


నందవరం...


మంత్రాలయంలో రాఘవేంద్రరెడ్డిని, నాయకులను సన్మానిస్తున్న ఛైర్మన్లు

'సీజనల్'తో కలలు సహకారం : ఎంఇఒ

ప్రజాశక్తి - హాలహర్వి


మాట్లాడుతున్న ఎంఇఒ ఈరన్న, నాగరాజు

వలస విద్యార్థుల కలలు సహకారం చేసుకోవాలని ఎంఇఒ ఈరన్న, ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్.నాగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని నిట్రవట్టి గ్రామంలో సీజనల్ హాస్టల్‌ను ప్రారంభించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కలెక్టర్, డిఇఒ ఆదేశాల మేరకు మండలంలో సీజనల్ హాస్టళ్ల ద్వారా 50 మంది విద్యార్థులు వలసలు వెళ్లకుండా నాణ్యమైన భోజనంతో పాటు విద్యనందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. జడ్‌పిహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్ అకీమ్, ఉపాధ్యాయులు నాగ స్వామి, సురేష్ కుమార్ రెడ్డి, జ్యోతి, సిఆర్‌పిలు ముక్కన్న పాల్గొన్నారు.

హనుమంతురెడ్డి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపిపి హనుమంతు రెడ్డి కుటుంబాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో టిడిపి మంచి నాయకుని కోల్పోయిందన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి, కౌతాళం నాయకులు అడివప్ప గౌడ్, సాయిబాబా, చాంద్ ఖాన్, టిప్పు సుల్తాన్, పెద్దకడబూరు నాయకులు అంజినయ్య, నరసన్న, మబ్బు అంజినయ్య, దశరథ రాముడు, ఆదాం, ఆశీర్వాదం పాల్గొన్నారు.


హనుమంతురెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న తిక్కారెడ్డి

'బీసీ హాస్టల్ సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రజాశక్తి - మంత్రాలయం


మాట్లాడుతున్న వెంకటరమణమ్మ

బీసీ హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి వెంకటరమణమ్మ తెలిపారు. హాస్టల్ సమస్యలపై సిఐ రామాంజులు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌తో ప్రస్తావించారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు వెంకటరమణమ్మ మంగళవారం మంత్రాలయం బీసీ హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్య, మెనూ అమలు, లైటింగ్, ట్యూటర్‌ను నియమించాలని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మోటారుకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా చేయించారు. మిగిలిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. సబ్ కలెక్టర్‌కు, సిఐ రామాంజులుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు అర్బన్ అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి ఆంజనేయులు, ఇఒ నాగరాజు ఉన్నారు.